క్రీడా శిక్షణకు కసరత్తు

- మైదానాల ఎంపికల్లో అధికారులు నిమగ్నం
- క్రీడా సామగ్రి పంపిణీకి చర్యలు



ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయనున్న టీఆర్‌టీ కాలనీ పార్కు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు వేసవి సెలవులు సమీపిస్తున్న నేపథ్యంలో క్రీడా శిక్షణ కేంద్రాల ఏర్పాటు కోసం కసరత్తు చేస్తున్నారు. జిమ్‌లు, పిల్లల పార్కుల కోసం అవసరమైన ప్రదేశాలను అధికారులు ఎంపిక చేశారు. వీటి ఏర్పాటుకు అవసరమైన నిధులను కూడా విడుదల చేశారు. కొన్ని రోజుల్లో పనులు ప్రారంభించే దిశగా అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకోసం నిధులను కూడా మంజూరు చేశారు. ఇదిలా ఉండగా వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువకులకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణలు ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. శిక్షణ ఇచ్చేందుకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న జీహెచ్‌ఎంసీ మైదానాలతో పాటు ఖాళీ ప్రదేశాలను అన్వేషిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లోని యువతీ యువకులను ఎంపిక చేసి క్రీడా సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

50 మైదానాలు ఎంపిక..

వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ కోసం సర్కిల్ మొత్తం మీద వంద మైదానాలు ఎంపిక చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు అవరసమైన ఖాళీ స్థలాల కోసం ఇప్పటికే అన్వేషణ ప్రారంభించారు. లాలాపేట స్టేడియం, బీదలబస్తీ మైదానం, ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలతోపాటు కాలనీల్లోని ఖాళీ స్థలాలు ఎంపిక చేసి శిక్షణలు ఇవ్వనున్నారు. మైదానాల విస్తీర్ణం, పరిస్థితుల ప్రాతిపదికన వసరమైన క్రీడాంశాల్లో శిక్షణలు కొనసాగించనున్నారు. శిక్షణ తరగతులకు గతంలో హాజరైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ ఏడాది కోచ్‌లను నియమించి శిక్షణకు అవసరమైన ఏర్పాట్ల కోసం సన్నాహాలు చేస్తున్నారు.

జిమ్‌లు, పార్కులకు నిధులు..

ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్‌పార్కులను సర్కిల్ పరిధిలోని పది ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. ప్రతిపాదిత పది అభివృద్ధి పనుల కోసం రూ.77 లక్షల నిధులు జీహెచ్‌ఎంసీ అధికారులు మంజూరు చేశారు. అడ్డగుట్ట సమోసా గార్డెన్, శాంతినగర్ వ్యాయామశాల ప్రాంతంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తారు. తార్నాక డివిజన్ నాగార్జున నగర్ పార్కు, ప్రొ.జయశంకర్ స్టేడియంలో ఓపెన్‌జిమ్‌లు, న్యూ మెట్టుగూడ పార్కులో ఓపెన్ జిమ్, చిల్డ్రన్‌పార్కును ఏర్పాటు చేస్తారు. సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ పార్కులో ఓపెన్ జిమ్, టీఆర్‌టీ కాలనీ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నారు. బౌద్ధనగర్ డివిజన్ దుర్గామాత గుడి సమీపంలోని ఎస్‌బీఐ కాలనీ పార్కు, రోడ్డు నెంబర్ 5–లోని జీహెచ్‌ఎంసీ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..



సర్కిల్ పరిధిలో పిల్లలు, యువకులకు వ్యాయామం, క్రీడల్లో శిక్షణ కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. యువకుల కోసం పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. పిల్లలకు అవసరమైన క్రీడా సామగ్రిని అందుబాటులోకి తెస్తున్నాం. పార్కుల పరిస్థితి ప్రాతిపదికన ఆయా ప్రాంత ప్రజలకు అవసరమైన వసతులు అందుబాటులోకి తేనున్నాం. వేసవి క్రీడా శిక్షణల కోసం కసరత్తు చేస్తున్నాం.

–ఎస్.సుధాంశ్, డిప్యూటీ కమిషనర్

నిరంతరం కొనసాగించాలి..



పార్కులను ప్రజలకు అందుబాటులోకి తేవడం, ఓపెన్‌జిమ్‌లు, పిల్లల పార్కులు ఏర్పాటు చేయడం అభినందనీయం. వేసవి శిక్షణ శిబిరాల మాట అటుంచి పిల్లల పార్కులను నిరంతరం కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలి. పార్కులకు తాళాలు వేసి ఉంచడం కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లల ప్రవేశాన్ని అనుమతించాలి.

–చంద్రశేఖర్, టీఆర్‌టీ కాలనీ అధ్యక్షుడు

క్రీడా సామగ్రి అందించాలి..



వేసవి శిక్షణ కోసం అనువైన మైదానాలు, ఆయా ప్రాంతాల్లో శిక్షణ ఇవ్వాల్సిన క్రీడాంశాల పట్ల అధికారులకు నివేదికలు అందించాం. మైదానాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు కాలనీలు, బస్తీల్లోని యువతీ యువకులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాం. డివిజన్ పరిధిలోని అన్ని పార్కులను ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరాం.

–సామల హేమ, కార్పొరేటర్

ముగిసిన బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న విద్యా శంకర భారతి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి భావనా కాలనీలోని గణేశ దేవస్థానం 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసాయి. శనివారం ప్రారంభమైన బ్రహ్మోత్సవాలను మూడు రోజులు పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముగింపు కార్యక్రమాలకు జగద్గురు పుష్పగిరి శంకరాచార్య అభినవోద్దండ విద్యా శంకర భారతి స్వామి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఉదయం 9.00 గంటలకు మహా గణపతి పూజతో ప్రారంభమైన పూజల్లో భాగంగా పంచామృత అభిషేకం, గణేశ హవనం, బలి ప్రదానం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విద్యా శంకర భారతి ఆశీర్వచన పూర్వక ప్రవచనం నిర్వహించి, అన్నప్రసాద వితరణ చేశారు. పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ సంపత్ రాజ్ జైన్, సతయ్య, దుర్గా రెడ్డి, యాదగిరి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మద

వైద్య ఖర్చులకు రూ. లక్ష అందజేత



చెక్కును అందజేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షులు రఘుకిరణాచార్యులు అన్నారు. కొంతకాలంగా ఆరోగ్య సమస్యతో సతమతమవుతున్న బాధిత కుటుంబానికి తుకారాంగేట్‌లోని బ్రాహ్మణ సేవా వాహిని కార్యాలయంలో సంఘం తరుపున వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కొండాపూర్‌కు చెందిన తటవర్తి శరత్ కుమార్‌కు ఆరేళ్ల కూతురు ఉంది. కొంతకాలంగా సదరు బాలిక కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. వైద్య ఖర్చుల కోసం రూ. 6 లక్షలు కావాల్సి ఉంది. విషయం తెలుసుకున్న బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘు కిరణాచార్యులు సేవా వాహిని తరుపున సదరు బాలిక వైద్య ఖర్చుల నిమిత్తం తమవంతు సహాయంగా రూ. లక్ష చెక్కును సోమవారం బాలిక తండ్రి శరత్‌కు అందజేశారు. పేద కుటుంబాలకు ఆపదవస్తే సేవా వాహిని తమవంతు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు.

ద.మ.రైల్వే సీసీఎస్ అధ్యక్షుడిగా స్వామి



బాధ్యతలు స్వీకరించిన స్వామి, రామ్మోహన్

సికింద్రాబాద్: దక్షిణ మధ్య రైల్వే క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) ప్రెసిడెంట్‌గా మజ్దూర్ యూనియన్ బలపరిచిన అభ్యర్థి చిలుకు స్వామి ఎన్నికయ్యారు. 40వేల పైచిలుకు షేర్‌హోల్డర్లు, రూ.కోట్ల టర్నోవర్ కలిగిన సీసీఎస్‌కు రైల్వే చరిత్రలో మొదటిసారి ఒక సాధారణ ఉద్యోగి ప్రెసిడెంట్ కావడం ప్రత్యేకతగా చెప్పుకుంటున్నారు. రైల్వేశాఖలో ట్రాక్‌మెన్‌గా అత్యంత సాధారణ ఉద్యోగం చేస్తున్న చిలుకు స్వామి సంస్థ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారి రామ్మోహన్ గెలుపొందారు. మొత్తం 21 మంది డైరెక్టర్లు ఓటింగ్‌లో పాల్గొనగా 12 మంది మజ్దూర్ యూనియన్ బలపరిచిన అభ్యర్థులకు ఓట్లు వేసినట్టు సీసీఎస్ ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం ర్యాలీగా యూనియన్ కార్యాలయం వద్దకు చేరుకుని మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.శంకర్‌రావును కలిశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, యూనియన్ నాయకులు ఉదయభాస్కర్, సరోజినీరెడ్డి, మురళీధర్, రవీందర్, ఖాజాబాబు, నరసింహా పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: పిల్లలకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేట టీటీఐ ఆధ్వర్యంలో సోమవారం గీతాంజలి స్కూల్ విద్యార్థులకు రోడ్డుభద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. రహదారులపై క్రమశిక్షణతో మెలగాలని, రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఐ సిబ్బంది, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

'ఆసుస్' సెలెక్ట్ స్టోర్ ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న జిగ్నేష్ భవ్‌సార్

రాంగోపాల్‌పేట్: పర్సనల్ కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లలో ఉత్తమ బ్రాండ్‌గా పేరొందిన ఆసుస్ సెలెక్ట్ స్టోర్‌ను ఇండియా కన్స్యూమర్ అండ్ గేమింగ్ పీసీ నేషనల్ సేల్స్ హెడ్ జిగ్నేష్ భవ్‌సార్ విడాల్స్ టెక్ డైరెక్టర్ పంకజ్ లల్వానీ, జై భోరర్, బిజినెస్ సేల్స్ విశ్వనాథ్ నిరంజన్‌తో కలిసి శనివారం సికింద్రాబాద్ పార్క్ లేన్‌లో ప్రారంభించారు. ఆసుస్ నుంచి ఆధునిక ల్యాప్‌టాప్‌లు, గేమింగ్ పర్సనల్ కంప్యూటర్లు, డెస్క్‌టాప్‌లు, క్రియేటర్ సీరిస్ ల్యాప్‌టాప్‌లు నాణ్యతతో రూపొందించి తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. కొత్త కంప్యూటర్లతో పాటు పునరుద్ధరించిన కంప్యూటర్లు, పరికరాలు కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవింద్ గుప్తా, నిర్మల్ కుమార్ లల్వానీ, ప్రేమ్ కుమార్ లల్వాని, లలిత్ కొఠారి, ధరమ్‌చంద్ లల్వానీ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కాచిగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ మహిళా కమిటీ అధ్యక్షురాలు చామకూర సుజాత అధ్యక్షతన సోమవారం కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్‌లో మహిళా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చిన్నతనం నుంచే నేర్పించాలని సూచించారు.ఫిబ్రవరి 14న వాలంటైన్స్ డేను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, అది మన సంస్కృతి కాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కులగణనలో మున్నూరు కాపులందరూ కులగణన పత్రంలో మున్నూరుకాపు అని మాత్రమే రాయాలని సూచించారు. మహిళా దినోత్సవం మార్చి 8న శివరాత్రి పండుగ ఉన్నందున మార్చి 10న నిర్వహించనున్నట్లు మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో నగేష్, అన్నపూర్ణ, అన్నం శాంతి ప్రియ, జయశ్రీ. అనూష, గానవి గోదాసి, రాకేష్ పాల్గొన్నారు.

'నల్లగొండ సభ'ను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కృష్ణా జలాల పరిరక్షణ, కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగించడాన్ని వ్యతిరేకంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగిస్తే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సభకు బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ హాజరవుతారని చెప్పారు. 13వ తేదీ ఉదయం 9 గంటలకు మారేడ్‌పల్లిలోని మున్సిపల్ గ్రౌండ్‌కు చేరుకోవాలని, అక్కడి నుంచి ర్యాలీగా నల్లగొండ సభకు బయలుదేరనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్ హేమలత, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, లలితాచౌహాన్, కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావు, పవన్‌కుమార్, వెంకటేషన్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్, తలసాని మహేష్‌యాదవ్, ధర్మేంద్రయాదవ్, సైకిలాబ్‌యాదవ్, అశోక్‌యాదవ్, శ్రీహరి, సంతోష్, కిషోర్, మహేష్, ఆరీఫ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులతో సమీక్ష..

సికింద్రాబాద్: కృష్ణా జలాల సమస్యకు సంబంధించి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న చలో నల్గొండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమై కార్యక్రమం గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులను నల్గొండ తరలించే బాధ్యతలను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శైలజ, నాయకులు కంది నారాయణ, సుంకు రాంచందర్, నీల ప్రభాకర్, వెంకటేశ్, కృష్ణ యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

మూర్ఛపై అపోహలు వద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: మూర్ఛపై అపోహలు వద్దని అవగాహన ముఖ్యమని కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. అంతర్జాతీయ మూర్ఛ దినోత్సవం సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. మూర్ఛవల్ల ఎదురయ్యే వివక్షను భరించడం కష్టమేనని ఇది వృద్ధి చెందుతున్న దేశాలన్నింటిలోనూ ఉందన్నారు. దీని కారణంగా బాధితులు మానసిక, శారీరక, సామాజికంగా ఇబ్బంది పడతారని దీన్ని దూరం చేసేందుకు ప్రజల్లో అవగాహన అవసరమన్నారు. ఈ వ్యాధి కన్నా వివక్షను భరించడం కష్టమవుతుందన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహీ, న్యూరాలజిస్టు సీతా జయలక్ష్మి మాట్లాడుతూ.. నరాలకు సంబంధించిన ఈ మూర్ఛ వ్యాధితో దేశంలో కోటికి పైగా బాధపడుతున్న వారు ఉన్నారన్నారు. అన్నారు. ఇది వచ్చినపుడు నాడీ కణాల కార్యకలాపాలు దెబ్బ తింటాయని, కొన్ని సార్లు అసాధారణ ప్రవర్తన, అనుభూతులతో పాటు స్పృహ కూడా కోల్పోతారన్నారు. ఈ సందర్భంగా అనురాధ అనే మహిళ మూర్ఛ వ్యాధితో ఎదుర్కొన్న ఇబ్బందులు దాన్ని అధిగమించి ఉన్నత చదువులు, ఉద్యోగం ఎలా పొందింది వివరించి మూర్ఛ వ్యాధితో బాధపడేవారిలో ఆత్మవిశ్వాసం నింపారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిలకలగూడ: కార్మిక హక్కుల సాధన కోసం ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ కోరారు. చిలకలగూడ లేబర్ అడ్డా వద్ద కార్మికులతో కలిసి సోమవారం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లేబర్‌కోడ్ తీసుకొచ్చి కార్మికుల హక్కులు హరించిందని ఆరోపించారు. పట్టణ ఉపాధి హామీ, ఏడాదికి 200 పనిదినాలు, లేబర్ అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు, రూ.5 భోజన వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు జీవిత బీమా కార్డులు అందించాలని, ఆధార్ కార్డు ఆధారంగా ఇన్స్యూరెన్స్ రెన్యువల్ చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధు నర్సింగరావు, పోచయ్య, నరేందర్, అజీబాయ్, శ్రీను, మెహమూద్, మల్లేష్, నర్సింహా, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఈ–పెట్టీ కేసులో ఆరుగురికి జైలు

రాంగోపాల్‌పేట్: మద్యం తాగి న్యూసెన్స్ సృష్టించిన ఆరుగురికి జైలు శిక్ష పడింది. పై మార్కెట్ పోలీసుల వివరాల ప్రకారం.. గాస్మండికి చెందిన మోసిన్ షరీఫ్ (52), నవీన్‌కాంత్ (42), రాజేష్ యాదవ్ (42), జోసఫ్ (38), మహ్మద్ అక్బర్ (38), మహ్మద్ అఫ్జల్ (24) బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి నానా హంగామా సృష్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిపై ఈ–పెట్టీ కేసులు నమోదు చేసి సోమవారం 13వ సికింద్రాబాద్ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రెండ్రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

నేడు ప్రైవేటు ఉపాధ్యాయులకు వర్క్ షాపు

అంబర్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రాస్మా) ఆధ్వర్యంలో నేడు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ బోధన అంశాలపై వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సాధుల మధుసూధన్ తెలిపారు. పటాన్ చెరులోని ఎల్లంకి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వర్క్ షాపు ఉంటుందని నాణ్యమైన బోధన పద్ధతులపై నిపుణులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9347337244 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గ్రూప్-1 అభ్యర్థుల వయోపరిమితి పెంచడం పట్ల హర్షం

కాచిగూడ: గ్రూప్–1 అభ్యర్థులకు రెండు సంవత్సరాలు వయోపరిమితి పెంచడం పట్ల నేషనల్ ఎకనామికల్ వీకర్స్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తాడిశెట్టి పశుపతి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిదిన్నర సంవత్సరాలు పాటు కొనసాగిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రూప్–1 ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో వేలాది మంది నిరుద్యోగుల వయోపరిమితి దాటి ఉద్యోగ అవకాశం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల వయోపరిమితి పెంచడంతో వేలాది మంది నిరుద్యోగులకు గ్రూప్–1 పరీక్ష రాసే అవకాశం లభించిందన్నారు.

డివిజన్ కమిటీ ఏర్పాటు



బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని సోమవారం సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ సమక్షంలో ఏర్పాటు చేసినట్లు డివిజన్ అధ్యక్షుడు జేఎస్. అనిల్ కుమార్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా హరి గౌడ్, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, కోశాధికారి మధుకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కిరణ్ కుమార్, మహేష్ కుమార్, సెక్రటరీలుగా శ్యామ్, రాము, నవిన్, మహేష్, నర్సింగ్, ప్రతీష్‌ను నియమించినట్లు తెలిపారు.డివిజన్ కమిటీలోని ప్రతీ నాయకులు, కార్యకర్త ప్రజాసేవ, పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని ఆదం సంతోష్ సూచించారు.

'గాంధీ డైట్‌కిచెన్'లో బ్రెడ్ ఓవెన్ మెషిన్ ప్రారంభం



ఓవెన్ మెషిన్‌ను ప్రారంభిస్తున్న ఆస్పత్రి పాలనాధికారులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డైట్ కిచెన్‌లో అధునాతన బ్రెడ్ మేకర్ ఓవెన్ మెషిన్ అందుబాటులోకి వచ్చింది. నూతనంగా ఏర్పాటు చేసిన బ్రెడ్ మేకర్ యంత్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, చీఫ్ డైటీషియన్ రమేష్, ఆర్ఎంఓ–1 జయకృష్ణ సోమవారం ప్రారంభించారు. నిరుపేద రోగులకు మరింత ఆరోగ్యవంతమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని వివరించారు. సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో అత్యాధునికమైన బ్రెడ్ మేకర్ ఓవెన్, స్లైస్ కటింగ్ మెషిన్‌లను ఏర్పాటు చేసినట్లు డైట్ కాంట్రాక్టర్ శ్రీ వేంకటేశ్వర అసోషియేషన్ అధినేత రవికుమార్ తెలిపారు.

వైఎస్‌ఆర్ హయాంలోనే వైద్య రంగానికి పెద్దపీట

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే వైద్య రంగానికి పెద్దపీట వేశారని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యులు, స్ట్రాటజీ కమిటీ మెంబర్, డాక్టర్ లోకేష్ యాదవ్ అన్నారు. సోమవారం తన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని విద్యార్థి జేఏసీ నాయకులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల ప్రజలకు ఉచిత వైద్యం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. రక్తహీనతతో తలసీమియా వ్యాధితో బాధపడే రోగుల అవసరాల కోసం యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. సుమారు 325 మంది విద్యార్థులు దానం చేసిన రక్తాన్ని రెడ్ క్రాస్ సొసైటీకి అందచేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వికాస్, శ్రీనివాస్‌యాదవ్, రామచంద్రయాదవ్, లెనిన్, శ్రావణ్, వినోద్ పాల్గొన్నారు.

వయ్యారి భామలు.. మీ హంస నడక !



బేగంపేట కంట్రీక్లబ్‌లో జరిగిన డార్లింగ్స్–డే అలోహా 2024లో భాగంగా నిర్వహించిన ఫ్యాషన్ షో అదిరింది. కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 12న నిర్వహించే ఆసియాస్ బిగ్గెస్ట్ డార్లింగ్స్ డే–2024లో భాగంగా జరిగిన ఫ్యాషన్ షోలో భార్యాభర్తలు ర్యాంప్‌పై మెరిశారు. వయ్యారాల నడకలతో కనువిందు చేశారు. మోడళ్లను తలపించే రీతిలో మ్యూజిక్‌కు అనుగుణంగా వాక్ చేస్తూ అదరహో అనిపించారు. హైదరాబాద్‌తో పాటు ముంబాయి, ఢిల్లీ, కోల్‌కత్తా, అహ్మదాబాద్, పుణే, కేరళ, బెంగళూరు, చెన్నై, కొల్హాపూర్ వంటి నగరాల్లో ఈ వేడుకను నిర్వహిస్తోందని కంట్రీ క్లబ్ గ్రూప్ చైర్మన్ వై.రాజీవ్‌రెడ్డి పేర్కొన్నారు. –సనత్‌నగర్



